క్లుప్తంగా

ఆలయాల్లో ప్రత్యేక పూజలు


సుద్దమల్ల లక్ష్మీ కంబగిరి స్వామి ఆలయంలో భక్తులకు హారతిస్తున్న అర్చకుడు

ఉయ్యాలవాడ : మండలంలోని ఆర్.జంబుల దిన్నె, ఉయ్యాలవాడ, ఇంజేడు, సుద్దమల్ల గ్రామాల్లో వెలిసిన ఆలయాల్లో శనివారం భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అభయాంజనేయస్వామి, శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి, శ్రీ లక్ష్మీ నరసింహ కంబగిరిస్వామికి అభిషేకాలు, కుంకుమార్చన, ఆకుపూజలతో పాటు ప్రత్యేక పూజలు చేసి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు లక్ష్మణస్వామి, భాస్కరశర్మ, అనంతయ్య, కమలేష్‌శర్మలు తీర్థప్రసాదాలు అందజేశారు.

జిల్లా కేంద్రంలో శిక్షణ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

నంద్యాల(న్యూటౌన్): ఎఫ్‌ఎల్‌ఎన్ (ఫౌండేషన్, లిటరసీ న్యూమరసి) శిక్షణ కార్యక్రమాన్ని వాయిదా వేసి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాలని నంద్యాల జిల్లా ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి శివయ్య డిమాండ్ చేశారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల 21వ తేదీ నుంచి 400 కి. మీ దూరంలోని హిందూపురంలో ఆరు రోజుల రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడాన్ని ఖండించారు. ప్రభుత్వం స్పందించి శిక్షణను వాయిదా వేయాలని కోరారు. సమావేశంలో అడిట్ కన్వీనర్ భాస్కరరెడ్డి, రంగనాయకులు, గాలయ్య, నౌమాన్‌బాషా పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం


రుద్రవరంలో ఆలయ నిర్వాహకులకు నగదును అందజేస్తున్న దాత

రుద్రవరం: మండల కేంద్రమైన రుద్రవరంలోని కాశీవిశ్వేశ్వర, ఆంజనేయ, లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయాల అభివృద్ధికి మండలంలోని ఎల్లావత్తులకు చెందిన ఫార్మ శేఖర్ శనివారం రూ.25,116 విరాళంగా ఇచ్చారు. ఈ మేరకు నగదును ఆలయ నిర్వాహకులు నూకల కృష్ణమూర్తి, నల్లగట్ల వెంకటేశ్వర్లు తదితరులకు అందజేశారు. అనంతరం దాతను ఆలయ నిర్వాహకులు సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.


కర్షక వృద్ధి డిపాజిట్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

శిరివెళ్ల: కర్షక వృద్ధి డిపాజిట్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక కేడీసీసీ బ్రాంచి మేనేజర్ రేణుకదేవీ అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ.. 333 రోజుల కాల వ్యవధియని , సీనియర్ సిటిజన్లకు 8 శాతం వడ్డీ, ఇతరులకు 7.50 శాతం వడ్డీ వస్తుందన్నారు. ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి పథకం కింద డిపాజిట్ల సేకరణ మొదలయిందన్నారు. నవంబర్ 1వ తేదీ వరకు డిపాజిట్ల సేకరణ ఉంటుందన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

శిరివెళ్ల: మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ వర్కర్ పోస్టుల భర్తీకి చర్యలు ప్రారంభమయ్యాయని ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ సువర్ణలత శనివారం తెలిపారు. గుంప్రమాన్ దిన్నె అంగన్‌వాడీ కేంద్రం టీచర్ పోస్టు ఖాళీగా ఉందని ఆ పోస్టును బీసీ–ఏకు కేటాయించారన్నారు. గత టీచర్ రమణమ్మ మృతి చెందడంతో ఖాళీఅయ్యిందన్నారు. అలాగే గుండంపాడు కేంద్రం ఆయా పోస్టు ఖాళీగా ఉందన్నారు. పోస్టును జనరల్‌కు కేటాయించారని చెప్పారు. పోస్టులకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఈ నెల 21వ తేదీ లోపు దరఖాస్తు అందజేయాలన్నారు.

అధికారులకు అభినందనలు


ఎంపీడీఓ భాగ్యలక్ష్మిని సత్కరిస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్లు

రుద్రవరం: రుద్రవరం ఎంపీడీఓగా భాగ్యలక్ష్మి, ఏఓగా సుబ్రహ్మణ్యం, జూనియర్ అసిస్టెంట్‌గా హరికిషన్ ఇటీవలే బాధ్యతలు చేపట్టారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జీపీడీపీ శిక్షణ కార్యక్రమం ముగియగానే మండలంలోని 16 గ్రామ సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు ఎంపీడీఓను, ఏఓ, జూనియర్ అసిస్టెంట్‌లను వేర్వేరుగా శాలువ, బొకే, పూలమాలలతో సత్కరించి అభినందనలు తెలిపారు.

అవినీతికి గేట్లెత్తారు!

- మార్కెట్ గేట్ల ఆదాయం స్వాహా
- జిల్లాలోని అన్ని మార్కెట్లకు వేలం జరిగినా నంద్యాలలో పట్టించుకోని అధికారులు
- 7 నెలలు ఆలస్యంగా వేలాలు
- నంద్యాల మున్సిపాలిటీకి సుమారు రూ.35.45 లక్షల మేర నష్టం
- వ్యాపారులను అధికారులే తప్పుదోవ పట్టిస్తున్నారనే విమర్శలు


కూరగాయల మార్కెట్


మార్కెట్ గేట్ల బహిరంగ వేలానికి సరైన పోటీలేక ఖాళీగా ఉన్న కుర్చీలు (ఫైల్)

నంద్యాల(సిటీ): పట్టణంలోని కూరగాయల పెద్ద మార్కెట్ నుంచి వచ్చే ఆదాయానికి అధికారులే గండి కొడుతన్నారనే విమర్శలున్నాయి. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో మార్కెట్ గేట్లకు 7 నెలల క్రితమే బహిరంగ వేలాలు నిర్వహించగా..జిల్లా కేంద్రమైన నంద్యాల పెద్ద మార్కెట్ గేట్లకు మాత్రం బహిరంగ వేలం జరగకుండా అధికారులే అడ్డంకులు సృష్టిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మున్సిపాలిటీకి అధికంగా ఆదాయాన్ని సమకూర్చే మార్కట్ గేట్ల నుంచి లాభాలు పొందడానికి మున్సిపల్ రెవెన్యూ అధికారులే అవినీతికి గేట్లెత్తారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మున్సిపాలిటీకి ఒక ఆర్థిక సంవత్సరంలో దాదాపుగా రూ.80 లక్షల పైగా ఆదాయాన్ని అందించే మార్కెట్ గేట్లను ఆదాయ వనరులుగా మార్చుకున్నందునే వేలాలను పలుమార్లు వాయిదా వేశారని సమాచారం.

గత ప్రభుత్వంలో లాభార్జనలో మార్కెట్ గేట్లు..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గాంధీ చౌక్‌లోని కూరగాయల పెద్ద మార్కెట్ గేట్లు బహిరంగ వేలం ద్వారా సింహభాగం ఆదాయాన్ని అందించింది. కానీ అందుకు భిన్నంగా ప్రస్తుత టీడీపీ పెద్దలు అధికారులతో కుమ్మక్కై మార్కెట్ గేట్ల ఆదాయాన్ని సొంతం చేసుకునే యోచనలో ఉన్నట్లు సమాచారం. ప్రతి సంవత్సరం గేట్ల నుంచి వచ్చిన ఆదాయంతో లక్షలాది రూపాయలు వెచ్చించి మార్కెట్‌ను గతంలో అభివృద్ధి చేసిన సంగతి తెలిసిందే. కానీ కూటమి ప్రభుత్వం మాత్రం ఆదాయాన్ని తమ అనుయాయులకు కట్టబెట్టేందుకు పన్నాగం పన్నుతున్నట్లు సమాచారం.

అధికారుల చేతివాటం..

మార్కెట్ గేట్లకు బహిరంగ వేలం జరగకుండా రెవెన్యూ అధికారులు తమ చేతి వాటం ప్రదర్శిస్తున్నారు. సాధారణ ఎన్నికల ముందు నుంచి ఇప్పటి వరకూ అధికారులు వ్యాపారులు, కౌన్సిల్ కళ్లు కప్పి భారీ ఎత్తున సొమ్ము చేసుకున్నట్లు తెలుస్తోంది. మార్కెట్ గేట్ వసూళ్లలో అధికారులు అక్రమార్జనకు మార్గంగా ఎంచుకున్నారు. ఇందులో ఉన్నతాధికారులకు కూడా వాటాలు అందుతున్నందునే నోరు మెదపకుండా ఉన్నారనే వాదనలు ఉన్నాయి.

ఆలస్యంగా వేలాలు..

2024–25వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మార్కెట్ గేట్లు, సైకిల్ పార్కింగ్, పలు మున్సిపల్ దుకాణాలకు అధికారుల నిర్లక్ష్యంతో ఏడు నెలలు ఆలస్యంగా బహిరంగ వేలాలు జరిగాయి. ఈ సమయంలో గేట్ వసూలుకు సంబంధించి కొందరికి బిల్లులు ఇచ్చి, మరికొందరికి ఇవ్వకుండా మేనేజ్ చేసి ఆ సొమ్మును జేబుల్లో వేసుకున్నారని ఆరోపణలున్నాయి.

ప్రకటనలకు లక్షలాది రూపాయల చెల్లింపులు..

నంద్యాల మున్సిపాలిటీలోని వ్యాపార దుకాణాలకు, షాపింగ్ కాంప్లెక్స్‌లకు, సైకిల్‌స్టాండ్ పార్కింగ్, మార్కెట్‌గేట్ల ప్రకటనలకు అధికంగా వ్యయం చేసినట్లు తెలుస్తుంది. గత 7 నెలలుగా 6 సార్లు బహిరంగ వేలం వాయిదా పడటంతో అధికారులు మైక్ అనౌన్స్‌మెంట్, పత్రికా ప్రకటనలకు లక్షలాది రూపాయలు వెచ్చించారు. ప్రతి నెలా మైక్ అనౌన్స్‌మెంట్‌కు రోజుకు రూ.2,100 చొప్పున మూడు రోజుల పాటు వెచ్చించారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చిరు వ్యాపారులకు ఊరట..

గంపలకు, బుట్టలలో వ్యాపారాలు చేసుకునే చిరువ్యాపారులకు గత ప్రభుత్వం భారీ ఉపశమనాన్ని కల్పించేందుకు పన్నులో రాయితీ కల్పించారు. మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి ఆదేశాలతో మున్సిపల్ కౌన్సిల్ పన్ను రద్దును ఆమోదించింది. దీంతో రూ.83 లక్షల నుంచి రూ.61లక్షలకు ఆదాయాన్ని కుదించారు. అప్పట్లో చిరు వ్యాపారులు హర్షం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.

మార్కెట్ గేట్ల నుంచి లభించిన ఆదాయం..

సంవత్సరం	వేలం ద్వారా లభించిన ఆదాయం
2021-22	96,96,000
2022-23	83,98,000
2023-24	83,98,000
మొత్తం	2,64,92,000

తక్కువ కలెక్షన్ వసూలు..

మార్కెట్‌గేట్ల నుంచి రోజుకు సుమారుగా రూ.16వేలకు పైగా ఆదాయం రావాల్సి ఉండగా.. మున్సిపల్ రెవెన్యూ అధికారుల మాత్రం రూ.7వేలు మాత్రమే వసూలు చేసి మిగిలిన సొమ్మును కాజేస్తున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. చిరువ్యాపారుల పన్ను మినహాయింపుతో సరాసరి రూ.61లక్షలకు కుదించారు. అయితే రోజుకు రూ.7వేల ప్రకారం నెలకు రూ.25,55,000 మాత్రమే వసూలు చేస్తున్నారు. మిగిలిన రూ.35.45లక్షల సొమ్మును అధికారులే స్వాహా చేస్తున్నట్లు సమాచారం.

ఆధార్ క్యాంపులు సద్వినియోగం చేసుకోండి

ఉయ్యాలవాడ : మండలంలో ఈ నెల 22వ తేదీ నుంచి నిర్వహించే ప్రత్యేక ఆధార్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 22న తుడుమల దిన్నె, 23, 24, 25 తేదీల్లో మాయలూరు గ్రామ సచివాలయాల్లో క్యాంపులు నిర్వహిస్తామన్నారు. 2011 నుంచి 2016 సంవత్సర మధ్య కాలంలో ఆధార్ తీసుకున్న వారు తప్పనిసరిగా అప్‌డేట్ చేయించుకోవాలన్నారు. నూతనంగా ఆధార్ కార్డు పొందాలనుకునేవారు, కార్డులో పేరు, చిరునామా, పుట్టిన తేదీలు తప్పులు వుంటే సరి చేసుకునేందుకు వీలుంటుదని వివరించారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో ప్రతిభ


సాహోన్‌తో పాఠశాల యాజమాన్యం

ఆళ్లగడ్డ : పట్టణంలోని ప్రజ్ఞ పాఠశాల విద్యార్థి సాహోన్ రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో సత్తాచాటాడు. ఈ నెల 17న కర్నూలులో జరిగిన రాష్ట్ర స్థాయి చదరంగం పోటీల్లో రాష్ట్రంలోని వివిధ ప్రదేశాలకు చెందిన 350 మంది పాల్గొన్నారు. ఇందులో సాహోన్ మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో 4 వస్థానం సాధించాడు. ఈ సందర్భంగా శనివారం స్థానిక పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో సాహోల్‌ను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు హేమలతారెడ్డి, శివరామిరెడ్డి, సద్దాం ఉన్నారు.

ఉపాధి హామీ నిధులతో అభివృద్ధి పనులు

చాగలమర్రి: రూ.24.00 లక్షల ఉపాధి హామీ పథకం నిధులతో మండలంలోని నేలంపాడు, రాంపల్లె గ్రామాలలో శనివారం పలు అభివృద్ధి పనులకు ఎంపీడీఓ మంజులవాణి భూమిపూజ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కోసమే పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. మండలంలోని అన్నీ గ్రామాలలో ఉపాధి హామీ పథకం నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీ తదితర అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమంలో ఏఈ కొండారెడ్డి, ఏపీఓ నిర్మలాదేవి, పంచాయతీ కార్యదర్శులు రాజేష్, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.కొత్తపల్లె గ్రామంలో పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా రూ.30లక్షలకు సంబంధించిన అభివృద్ధి పనులకు ఎంపీడీఓ సావిత్రి శనివారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ సులోచన, పీఆర్ ఏఈ వెంకటరెడ్డి, భూమా సందీప్‌రెడ్డి, ఏపీఓ గంగన్న, పీఎస్‌లు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పల్లె పండుగ


అభివృద్ధి పనులకు భూమి చేసిన నాయకులు

నంద్యాల(అర్బన్): ఈనెల 14 నుంచి మండలంలోని గ్రామాల్లో ప్రారంభమైన పల్లె పండుగ–పంచాయతీ వారోత్సవాలు శనివారం ముగిశాయి. గుంతనాల, మిట్నాల, పోలూరు, పులిమద్ది, పెద్ద కొట్టాల గ్రామాల్లో శనివారం ఒక్క రోజే కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ పనుల్లో ఉన్న గ్రామీణులకు ఏ మాత్రం సమాచారం లేకుండా గ్రామాల్లో తూతూ మంత్రంగా వారోత్సవాలను జరిపించారు. కూటమి నేతల హడావుడి తప్ప వారోత్సవాల్లో స్థానికులు అరకొరగా పాల్గొన్నారు.

హామీని నిలబెట్టుకోవాలి


ర్యాలీని ప్రారంభిస్తున్న జనార్దన్‌రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని ఏపీ రైతు సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షుడు రమేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని నరసింహయ్య భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 21, 22 తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్ర వ్యవసాయ సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

చాపిరేవులలో వాక్ ఫర్ ఫ్రీడం

నంద్యాల(అర్బన్): మండలంలోని చాపిరేవుల గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం వాక్ ఫర్ ఫ్రీడం కార్యక్రమాన్ని నిర్వహించారు. ది మూవ్‌మెంట్ ఇండియా సహకారంతో గ్రామ జ్యోతి సొసైటీ సౌజన్యంతో స్థానిక స్వచ్ఛంద సంస్థ మదర్ సొసైటీ ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణాపై నిశ్శబ్ద ర్యాలీని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా వారి జీవితాలను నాశనం చేస్తుందని చెప్పారు. రైల్వే కానిస్టేబుల్ నాగరాజు, హెచ్‌ఎం శ్రీనివాసులు, తిరుపతిరావు, నాగేశ్వర రావు, పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సమష్టి నిర్ణయాలు తీసుకోవాలి

దొర్నిపాడు: గ్రామాభివృద్ధి కోసం సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు సమష్టి నిర్ణయాలు తీసుకోవాలని ఎంపీపీ గోవవరం అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న శిక్షణా తరగతలు శనివారంతో ముగిశాయి. ఆయన మాట్లాడుతూ పరిపాలనలో పారదర్శకత మరియు జవాబుదారీతనం తీసుకురావాలన్నారు. ఎంపీడీఓ సావిత్ర, ఈఓపీఆర్డీ సులోచన పాల్గొన్నారు.

బాధ్యతగా వ్యవహరిస్తే గ్రామాల అభివృద్ధి

చాగలమర్రి: ప్రజాప్రతినిధులు బాధ్యతగా వ్యవహరిస్తే గ్రామాలు అభివృద్ధి బాటలో పయనిస్తాయని ఎంపీడీఓ మంజులవాణి అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఏర్పాటు చేసిన పంచాయతీ ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యుల శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈఓపీఆర్‌డీ తాహీర్ హుసేన్, ఏఓ రాజేంద్రప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ బషీర్ అహ్మద్, పంచాయితీ కార్యదర్శులు ఆదినారాయణ, రాజశేఖర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చాగలమర్రి ఎంపీడీఓ మంజులవాణి

శిరివెళ్ల: పంచాయతీ పాలపై అవగాహన పెంచు కోవాలని ఎంపీడీఓ శివమల్లేరప్ప అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. ఈఓఆర్డీ శ్రీనివాసశర్మ పాల్గొన్నారు.

గోస్పాడు: గ్రామాల పరిధిలో పన్నుల సాధనకు ప్రజా ప్రతినిధులు, సిబ్బంది కృషి చేయాలని ఎంపీపీ ఆర్థర్ సైమాన్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో జరుగుతున్నరెండు రోజులు శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. రెండవ రోజు వార్డు మెంబర్లు, ఉప సర్పంచ్‌లకు ఎంపీడీఓ అమానుల్లా ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు.

గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోండి


రుద్రవరంలో లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న ఈఈ

రుద్రవరం: అసంపూర్తిగా ఉన్న గృహ నిర్మాణాలను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకోవాలని గృహ నిర్మాణ శాఖ ఈఈ హరిగోపాల్ సూచించారు. శనివారం మండలంలోని రుద్రవరం, రెడ్డిపల్లె, ఆర్.నాగులవరం, నర్సాపురం గ్రామాల్లో పర్యటించి, అసంపూర్తిగా ఉన్న గృహాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణాలు మొదలెట్టేందుకు ఇదివరకే రూ.5వేలు అడ్వాన్స్‌గా ఇప్పించామని, అలాగే బేస్ మెంట్ల వరకు నిర్మించుకున్న వారికి రూ.40వేల వరకు బిల్లులు అందించామని చెప్పారు. ప్రభుత్వం మారడం వల్ల గృహ నిర్మాణాల మంజూరుపై నూతన విధానం అమల్లోకి వస్తుందన్నారు. అందువల్ల 2024 మార్చి నెలాఖరు లోపు అసంపూర్తిగా ఉన్న వాటిని పూర్తి చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట డీఈఈ విజయబాబు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఆనంద్, ప్రసాదు ఉన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు అవగాహన


విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం వ్యక్తితత్వ వికాసం అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. యువజన సర్వీసుల శాఖ సెట్కూరు సహకారంతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ మాట్లాడుతూ విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ అలవర్చుకోవాలన్నారు. మంచి ధోరణి, ఏకాగ్రత, సహాయం చేసే గుణం, పెద్దలను గౌరవించడం లాంటి విషయాల్లో ఆదర్శంగా నిలిచి కళాశాలకు మంచిపేరు తీసుకు రావాలన్నారు. అనంతరం వ్యక్తిత్వ వికాస నిపునులు సయ్యద్ సలీంబాషా మాట్లాడుతూ 13– 21సంవత్సరాల్లోపు విద్యార్థులు శారీరక, మానసిక ఉద్వేగాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ లలిత, జయకృష్ణ, నాగేంద్రమ్మ, విజయలక్ష్మి, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల కోసం ఉద్యమించాలి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గఫూర్

నంద్యాల(న్యూటౌన్): అసంఘటిత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని, ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల జీవితాల్లో వెలుగుల కోసం ఉద్యమించాలని సీఐటీయూ రాష్ట్ర మాజీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గఫూర్ అన్నారు. శనివారం స్థానిక నేషనల్ పీజీ కళాశాలలో ఆలిండియా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌ను జెండా ఆవిష్కరించి ప్రారంభించారు. రాష్ట్ర అధ్యక్షుడు శివాజీ అధ్యక్షతన జరిగిన వర్క్‌షాప్‌లో గఫూర్ మాట్లాడుతూ యువత ఉద్యోగాలు లేక ఆటోలు, ట్రాన్స్‌పోర్ట్ కార్మికులుగా, రవాణా రంగంలో పని చేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. డ్రైవర్లు, క్లీనర్లకు భద్రత లేదన్నారు. వీరి జీవితాలు గాలిలో దీపం లాంటివన్నారు. కార్మికుల జీవితాల్లో మార్పు రావాలని, అందు కోసం ఉద్యమించాలన్నారు. కేరళ తరహాలో ఏపీలో రవాణా రంగంలో పనిచేసే కార్మికులకు సంక్షేమ పథకాలు అందజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం శివాజీ, సంఘం ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహమ్మద్, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ 6 లక్షల మంది ఆటో కార్మికులు ఉన్నారని, సంక్షేమ పథకాలు అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి దివాకర్, నంద్యాల జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఏసురత్నం, నాగరాజు, ఎల్లయ్య, వీరేశన, శ్రీనివాసరావు, పోలినాయుడు, సురేష్, హరిపోతరాజు పాల్గొన్నారు.


ఎర్రగుడిదిన్నె వద్ద నీట మునిగిన జొన్నపైరు


చిలుకలూరు వద్ద ధాన్యం బస్తాలు తడవకుండా కప్పిన పట్టలు

వదలని వర్షం.. రైతన్నకు తప్పని కష్టం

- పంట పొలాలను వీడని వర్షపు నీరు
- దెబ్బతింటున్న పైర్లు, పంటలు
- ఆందోళనలో రైతులు

రుద్రవరం: ఆళ్లగడ్డ నియోజకవర్గ పరిధిలో వారం రోజుల నుంచి వర్షం వదలకుండా కురుస్తూనే ఉంది. దీంతో రైతన్నకు కష్టం తప్పడంలేదు. ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగుచేసిన పంటలు వ్యయప్రసాయలకోర్చి, కంటికి రెప్పలా కాపాడుకున్నారు. పంట కాలం పూర్తి కావడంతో మినుము, మొక్క జొన్న పంట కోతలు జోరుగా సాగే సమయంలో తుపాను రైతులను పట్టి పీడిస్తోంది. కోతలు ముందుకు సాగనివ్వక, వచ్చిన దిగుబడులను ఆరబెట్టుకునేందుకు, విక్రయాలు సాగించుకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. ఎర్రగుడిదిన్నె, పేరూరు, చిలుకలూరు తదితర గ్రామాల పరిధిలో రబీ పంటగా వందలాది ఎకరాల్లో జొన్న సాగు చేశారు. ఆ పంట ప్రస్తుతం మొలక దశలో ఉంది. వారం రోజులుగా కురుస్తున్న వర్షానికి ఆ పొలాల్లో నీరు నిల్వ ఉండటంతో పైరు నీట మునిగి దెబ్బతింటోంది. చిలుకలూరు వద్ద శనివారం ఆరబెట్టిన మొక్క జొన్న విక్రయించి తూకాలు వేసి లారీకి ఎక్కిస్తుండగా వర్షం మొదలైంది. దీంతో రోడ్డు పై వేసిన బస్తాలు తడవకుండా పట్ట కప్పుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.


పెద్దయమ్మనూరు, ఇంజేడు గ్రామాల మధ్య వంతెనపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

ముంచెత్తిన వర్షాలు

ఉయ్యాలవాడ : ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లాయి. పొలాలు వర్షపు నీటితో నిండి కుంటలను తలపిస్తున్నాయి. భీమునిపాడు, ఆర్.జంబులదిన్నె ఆర్ అండ్‌బీ రహదారిలో ఇంజేడు గ్రామ సమీపంలో వున్న వంతెనపై వర్షపు నీరు ప్రవహిస్తోంది. ఈ వంతెన భూమికి సమాంతరంగా వుండడంతో ఈ రహదారిలో ద్విచక్రవాహనదారులు, కార్లు, ఆటోలు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలకు ఖరీఫ్‌లో సాగు చేసిన సీడుపత్తి, మొక్కజొన్న, మిరప, వరి, తదితర పంటలు ఎక్కనా చూసిన నీటి మడుగులు వుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


బుర్రారెడ్డిపల్లెలో వర్షంలోనే క్రాసింగ్ పనులు చేస్తున్న కూలీలు

వర్షంలో తడుస్తూనే సీడుపత్తి క్రాసింగ్

దొర్నిపాడు వారం రోజులుగా కురుస్తున్న తుపాను తాకిడికి రైతులు సీడ్‌పత్తి క్రాసింగ్ పనులకు విరామం ఇచ్చారు. శనివారం ఉదయం భానుడు నిప్పులు కక్కుతూ దర్శనం ఇచ్చారు. ఇక ఎల్లడి ఇచ్చినట్లేనని కూలీలకు ఫోన్‌లు చేసి మరీ పనులకు పిలిపించుకున్నారు. క్రాసింగ్ పనులు మొదలు పెట్టి రెండుగంటలు అయ్యేసరికి జల్లులు మొదలయ్యాయి. అయినా తలలు తడవకుండా తువ్వాలు చుట్టుకొని కూలీలు మొండిగా పనులు చేపట్టారు. ఆతరువాత వర్షం ఎక్కువ కావడంతో తప్పని పరిస్థితుల్లో బయటకు వచ్చారు. ఈ సారి తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని పత్తి రైతులు వాపోతున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

రుద్రవరం: మండలంలోని తువ్వపల్లె తిప్పమీదున్న ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు ఆర్చరీ క్రీడలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు తెలిపారు. శనివారం పాఠశాలలో ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఈ నెల18న నంద్యాలలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్- 17 విభాగం పోటీల్లో చరిత, సుప్రజ, అలేఖ్య, రాఘవేంద్ర, అండర్–14 విభాగంలో బాలాజీ సత్తా చాటి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారన్నారు. వారు నవంబర్ 3, 4, 5 తేదీల్లో పార్వతీపురంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.